క్లుప్తంగా

వృద్ధులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సీటీఆర్ఐ: లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గౌతమి జీవకారుణ్య సంఘంలోని వృద్ధులకు జగ్గంపేటలోని లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి బుధవారం జగ్గంపేటలో ఆపరేషన్లు నిర్వహిస్తారని క్లబ్ అధ్యక్షుడు వీఎస్ శ్రీరామ గుప్త చెప్పారు. దాదాపు వంద మందిని పరీక్షించి, 18 మందికి ఉచిత కేటరాక్ట్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్లబ్ రీజియన్ చైర్పర్సన్ మధునూరి వాణిశ్రీ, పూర్వ గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు, గ్రంధి వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలి

కడియం: బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని మండల హిందూ ధర్మ ప్రచార సమితి సభ్యులు మంగళవారం స్థానిక తహసీల్దార్, కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు. దీనిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సభ్యులు కోరారు.


15 నుంచి 'పంచ పరివర్తన్' జన జాగరణ

సీటీఆర్ఐ: స్వాతంత్య్ర దినోత్సవం, రక్షా బంధన్ సందర్భంగా ఈ నెల 15 నుంచి పంచ పరివర్తన్ పేరిట జన జాగరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ్ చాలక్ డాక్టర్ కర్రి రామారెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పంచ పరివర్తన్‌లో భాగంగా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి చైతన్యం కలిగిస్తారని చెప్పారు. భారతీయ హిందూ సమాజం కులాల ఆధారంగా విడిపోవడం, ద్వేష భావం నెలకొనడం దేశాభివృద్ధికి ప్రతిబంధకంగా మారిందన్నారు. వృత్తిని బట్టి కులాలు వచ్చాయని, కొన్ని కులాలను అంటరానితనంగా చూడడం తగదన్నారు. కులాలు వేరైనా అందరూ ఒక్కటేనన్న భావన కలిగించేందుకు ఈ కార్యక్రమం ఉద్దేశించిందన్నారు. ఇక పర్యావరణ సమస్య రోజురోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో, ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, పర్యావరణ సమతుల్యత కాపాడడానికి చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: స్పిన్నింగు మిల్లు కాలనీలో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లాలాచెరువు స్పిన్నింగు మిల్లు కాలనీలో పెమ్మనబోయిన సాయి, లావణ్య (20) అనే దంపతులు నివసిస్తున్నారు. ఆటోమొబైల్ షాపులో సాయి పనిచేస్తున్నాడు. అయితే లావణ్య వేరొకరితో మాట్లాడుతూ ఉండడంతో సాయి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన లావణ్య సోమవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. లావణ్య తండ్రి పట్నాల గురునాథ్ ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై బి.శ్రీను మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు మృతదేహాలు లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

కంబాలచెరువు: రాజమహేంద్రవరంలో రెండు వేర్వేరు చోట్ల గుర్తు తెలియని మృతదేహాలను పోలీసులు కనుగొన్నారు. మూడో పట్టణ పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక లింగంపేట ఐదో వీధి ఆంజనేయ స్వామి గుడి వద్ద మృతదేహం ఉందని సమాచారం అందడంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లారు. మృతుడి వయస్సు 50 నుంచి 60 ఏళ్లుంటాయి. ఎడమ మోచేతిపై బి.రామారావు అని పచ్చబొట్టు ఉంది. అలాగే ప్రభుత్వాస్పత్రి సమీపంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల వద్ద కూలీలు స్నానం చేసే ప్రాంతంలో మృతదేహం పడి ఉంది. ఈ మేరకు నిర్మాణ పనులు చేస్తున్న మెగా సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉంది. రెండు మృతదేహాలను పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. వివరాలు తెలిస్తే మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్న ప్రసాద్ అనే వ్యక్తి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. తనకు రూ.20 వేలు అప్పు ఇచ్చిన వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని లాక్కుని వేధిస్తున్నాడంటూ ఈ నెల 10న లింగంపేటకు చెందిన ప్రసాద్(42) మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే రోజు సాయంత్రం ప్రసాద్ పోలీస్‌స్టేషన్ వద్ద పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య యత్నం చేశాడు. తీవ్రంగా గాయపడిన అతడిని పోలీసులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకు కాకినాడకు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వెలకట్టలేని కన్నీరు

- అనధికార చెక్ డ్యాంతో ఆవ రైతుల కష్టాలు
- కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా తీరని సమస్య..!
- అధికారుల తీరుపై అన్నదాతల మండిపాటు
- తీవ్రంగా నష్టపోతున్న ఖైనం
- వ్యవసాయం మానేస్తామంటున్న కర్షకులు

ప్రకృతి కన్నెర్ర చేసిన సందర్భాల్లో అన్నదాలకు కష్టనష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం.. మానవ తప్పిదాల కారణంగా తీరని నష్టాలు మిగుల్చుతుంటే.. తమకు దిక్కెవరంటూ రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ముంపులో చిక్కుకున్న ఆవ పొలాలివే..

కడియం: ప్రకృతికి ఎదురొడ్డి సాగు చేసే రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నిత్యం అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటూ పంటను కాపాడుకునేందుకు రైతులు పడే పాట్లు అధికారులకు సైతం పట్టడం లేదు. సమస్య చెప్పుకొంటే, 'ఈ సమస్యను చూడండి' అంటూ కింది స్థాయి అధికారులకు ఆదేశాలిచ్చి చేతులు దులుపుకొంటున్నారు కానీ, సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. వివరాల్లోకి వెళితే..

కాలువపై అనధికార డ్యాం

రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలు ప్రాంతానికి చెందిన పలువురు రైతులకు కడియం మండలం పరిధిలోని ఆవలో దాదాపు 700 ఎకరాల వరకు పొలాలున్నాయి. ఎగువన ఉన్న ఈ రైతుల పొలాల నుంచి ముంపునీరు మురుగు కాలువ ద్వారా వేమగిరి–కాకినాడ కాలువలోకి చేరాలి. అయితే ఇలా ముంపు నీరు దిగువకు మళ్లించే మురుగు కాలువపై అనధికార డ్యాంను నిర్మించి, నిత్యం తలుపులు మూసి ఉంచుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీని కారణంగానే తమ పొలాల నుంచి ముంపు నీరు దిగువకు వెళ్లడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గత సోమవారం కలెక్టర్ పి.ప్రశాంతికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు కూడా చేశామని రైతులు అంటున్నారు. అయితే ఆర్డీఓను నేరుగా వెళ్లి సమస్యను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. కానీ ఆర్డీఓ బదిలీపై వెళ్లిపోవడంతో, ఈ సమస్యను పట్టించుకునే నాథుడే లేకపోయాడని వాపోతున్నారు.

మళ్లీ మళ్లీ ముంపు

వ్యవసాయ అధికారుల సూచనల మేరకు నెల రోజుల ముందే ఊడ్పులు పూర్తి చేశామని, కానీ వర్షాల కారణంగా నారు దెబ్బతిందని రైతులు చెబుతున్నారు. తిరిగి వర్షాలు తగ్గాక మళ్లీ నారు కొనుక్కొచ్చి, ఊడ్పులు పూర్తి చేసుకున్నామని రైతులు తెలిపారు. తీరా అనధికారిక డ్యాం కారణంగా మళ్లీ ముంపు ఏర్పడి ఇప్పుడు కొత్తగా ఊడ్చిన నారు కూడా కుళ్లిపోతోందని ఆవేదన చెందుతున్నారు. ఒకవేళ ముంపు నీరు తగ్గినా, నారు దొరక్కపోగా, సమయం కూడా మించిపోతుందని రైతులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని సంబంధిత అధికారులకు వివరించినప్పటికీ, వారి నుంచి నిర్లక్ష్యంగా సమాధానం వస్తోందంటున్నారు.

ఉచిత సలహాలతో సరి!

'కంగారు పడిపోతే పనులెలా జరుగుతాయి? కాస్త ఆగండయ్యా..!. అంటూ ఉచిత సలహాలిచ్చి అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఒకవైపు నారు దొరక్క, మరోవైపు సమయం మించిపోవడంతో తమకు ఏం చేయాలో పాలుపోవడం లేదని రైతులంటున్నారు. అనధికారికంగా డ్యాం నిర్మించినట్టు ధ్రువీకరించాల్సిందిగా ఇరిగేషన్ అధికారులను కోరితే, వారు కూడా స్పందించడం లేదని మండిపడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తాము సాగు మానేయాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. రైతుల సమస్య అంటే ఇంత చిన్న చూపు చూడడం అధికారులకు తగదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణం కలగజేసుకుని, తమ పొలాలను ముంపు నుంచి విముక్తి కలిగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి రైతులు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై ఎలా స్పందిస్తారో వేచిచూడాల్సిందే.

సమస్యను పరిష్కరించండి



కడియం ఆవ ప్రాంతంలో రాజవోలు గ్రామం రైతులకు చెందిన సుమారు 500 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. స్వయంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకూ సమస్య పరిష్కారం కాలేదు. రూరల్ మండల ఇన్‌చార్జి తహసీల్దార్ పొలాలు పరిశీలించి వెళ్లారే కానీ, ఎటువంటి పరిష్కారంపై మాట్లాడలేదు. ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు. ఆర్డీఓ దృష్టికి తీసుకువెళ్లినా ముంపు పొలాలను పరిశీలిస్తానని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి, రైతుల ముంపు సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తేనే వారికి మేలు జరుగుతుంది.

– వంకా రామకృష్ణ, రైతు, రాజవోలు

స్టేడియం పనులు వెంటనే ప్రారంభించండి

ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశం



స్టేడియం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: నాగులచెరువు మార్కెట్ వద్ద ఉన్న పోతుల వీరభద్రరావు మున్సిపల్ కార్పొరేషన్ గ్రౌండ్‌లో నిర్మించ తలపెట్టిన క్రికెట్ స్టేడియం పనులు ప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ కేతన్ గర్గ్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, శాప్ అధికారులతో కలిసి స్టేడియం ప్రాంతాన్ని సందర్శించారు. క్రికెట్ స్టేడియంలో చేపట్టనున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గ్రౌండ్ ఫ్లోర్‌లో అదనంగా టాయిలెట్లు, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, దుస్తులు మార్చుకునే గదులు నిర్మించాలన్నారు. ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు పడమర వైపున గేటు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని పనులకు తగిన అంచనాలు పూర్తి చేసి, టెండర్లు పిలవాలని ఆదేశించారు. వీరి వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ జి పాండురంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మదర్షా ఆలీ, డీఈఈ ప్రసాద్, ఏఈ సందీప్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సిటీ ఎమ్మెల్యే వాసుకు సమస్యను వివరిస్తున్న వేణుమాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యలను రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు హామీ ఇచ్చారు. మంగళవారం రాజమహేంద్రవరంలో రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్షుడు డి.వేణుమాధవరావు ఆధ్వర్యంలో సభ్యులు ఎమ్మెల్యేకు సమస్యలను విన్నవించారు. తమకు పదోన్నతులు కల్పించాలని కోరారు. తమకు ఏజీబీఎస్సీ చదివే అవకాశాన్ని కొన్ని సంఘాలు అడ్డుపడుతున్నాయని వివరించారు. వెంటనే ఎమ్మెల్యే వాసు మంత్రి అచ్చెం నాయుడుకు ఫోన్ చేసి, ఆయా సమస్యలపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. సంఘ ప్రతినిధులు పీటర్ ప్రభుదర్శన్, ఎం.నాగేశ్వరరావు, పీవీ శ్రీనివాస్, నానిబాబు ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రిని తీర్చిదిద్దుతా..

కంబాలచెరువు: రాజమండ్రి ప్రభుత్వాస్పత్రిని రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తామన్నారు. ఆస్పత్రిని పూర్తిగా ప్రక్షాళన చేస్తామన్నారు. ఆస్పత్రి కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. సదరం సర్టిఫికెట్ల విషయంలో కలెక్టర్ శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. కిడ్నీ బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. నామవరంలో 12 వందల గృహాలు త్వరలో ఇస్తామని మంత్రి చెప్పారన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు, వలంటీర్లు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): క్యాన్సర్ మహమ్మారిపై అవగాహన ఎంతో అవసరమని కార్పొరేషన్ విశ్రాంత హెల్తాఫీసర్, పీఎంపీ సంఘ జిల్లా ముఖ్య సలహాదారు ఎంవీఆర్ మూర్తి అన్నారు. క్యాన్సర్‌కు కారణమైన ఆహార అలవాట్లు, మద్యపానం, ధూమపానం ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగాలను విడనాడాలని చెప్పారు. పీఎంపీ సంఘ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సంఘ జిల్లా శాఖ, ఆదిత్య మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల సంయుక్తాధ్వర్యంలో మంగళవారం కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. వైద్య నిపుణుడు డాక్టర్ కె.రామ్‌గోపాల్ తేజ మాట్లాడుతూ క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే చికిత్స సులభమన్నారు. డాక్టర్ మాణిక్యాంబ మాట్లాడుతూ మహిళలకు వచ్చే రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లను వివరించారు. అనంతరం పీఎంపీ సభ్యులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రహమాన్, సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీబీ రాజు,, ప్రతినిధులు పి.దేవానందం, పి.చిన్ని,, ఎన్ఎస్ఎస్ పీఓలు నాగేశ్వరరావు, రమాదేవి పర్యవేక్షించారు.

దుర్వ్యసనాల వల్ల జీవితం నిర్వీర్యం

డాక్టర్ అనసూరి ప్రియాంక



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనసూరి ప్రియాంక

రాజమహేంద్రవరం సిటీ: గంజాయి వంటి మాదక ద్రవ్యాల బారిన పడకుండా విద్యార్థులు తమ జీవితంలో లక్ష్య సాధనకు పాటుపడాలని జేసీఐ ఇండియా జోన్ ట్రైనర్, జీవనశైలి స్పెషలిస్ట్, శ్రీలత హాస్పిటల్స్ అధినేత డాక్టర్ అనుసూరి ప్రియాంక అన్నారు. మంగళవారం స్థానిక సంహిత డిగ్రీ కాలేజీలో డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులకు, జేసీఐ రాజమండ్రి పెరల్స్ ప్రెసిడెంట్ జేసీ గీతా రామదేవు ఆధ్వర్యంలో ఆమె మాదక ద్రవ్యాల నుంచి కాపాడుకోవడంపై అవగాహన కల్పించారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ పొగ తాగడం, మద్యం సేవించడం వంటి దుర్వ్యసనాల వల్ల రోగాలు చుట్టుముడతాయన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు బానిసలైతే జీవితం నిర్వీర్యమవుతుందని హెచ్చరించారు. అందుకే మాదక ద్రవ్యాల జోలికి అస్సలు వెళ్లవద్దని హితవు పలికారు. కేవలం చదువుపైనే దృష్టి సారించి, ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.

దేశభక్తి పెంపొందేలా హర్ ఘర్ తిరంగా..

- జిల్లాలో స్ఫూర్తి పెంపొందించేలా నిర్వహణ
- కలెక్టర్ పి.ప్రశాంతి
- వివిధ ప్రాంతాల్లో ర్యాలీలు
- పాల్గొన్న ప్రముఖులు, ప్రజాప్రతినిధులు



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రతి భారతీయుడిలో దేశభక్తి పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను జిల్లాలో స్ఫూర్తివంతంగా నిర్వహించుకుంటున్నామని కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు. మంగళవారం స్థానిక వై.జంక్షన్ నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీని కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్, రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే, జిల్లా అధికారులతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో పెద్దఎత్తున ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, సిబ్బంది , స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు చిన్నారులు జాతీయ జెండాలను చేతబూని వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జాతీయ సమైక్యతను సమగ్రతను కాపాడటం మనందరి బాధ్యత అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లాలో ఈ నెల 9 నుంచి 15 వరకు ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. జిల్లా యంత్రాంగంతో పాటు, స్వచ్ఛంద సంస్థలు, యువత భాగస్వామ్యులు కావాలని దేశ సమగ్రతను కాపాడే ఈ మహోన్నత కార్యక్రమములో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్వాతంత్య్ర సమరయోధుల సేవలను స్మరించుకోవలసి ఉందన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను జిల్లాలో, ప్రతి మండల కేంద్రాల్లోను, గ్రామాల్లోను, వాడవాడలా జాతీయ సమగ్రతను తెలిపేలా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కడియం: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను పురస్కరించుకుని మంగళవారం వివిధ ప్రాంతాల్లో జాతీయ జెండాలతో ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. కడియం మండలంలోని జేగురుపాడు గ్రామంలో జాతీయ జెండాలతో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ జాతీయ సమైక్యత, సమగ్రత కాపాడుకోవడం ప్రతి భారతీయుడి కర్తవ్యమని, ప్రతి ఇంటిపైనా మువ్వన్నెల జెండాలు ఎగురవేసి దేశ సమగ్రతకు మన వంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.శిరీషా, ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీలు నాగిరెడ్డి శివాజీ, పాలపర్తి ప్రకాష్‌కుమార్, రంకిరెడ్డి చిట్టియ్య, మోహన్, నాగిరెడ్డి మోహన్, బళ్ల అన్నవరం, జగన్, గోపి ,శ్రీను నాగన్న, ఈశ్వర్, గోవింద్, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం కడియం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. లైబ్రేరియన్ శెట్టిపల్లి శ్రీదేవినిర్మల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించారు. పాఠకులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ: యువమోర్చా ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీలు నిర్వహిస్తుందని, ఈ నెల 13, 14, 15 తేదీల్లో ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు పిలుపునిచ్చారు. మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఏవీఏ రోడ్డు రామాలయం సెంటర్ నుంచి కోటిపల్లి బస్టాండ్ స్వాతంత్ర సమరయోధుల పార్కు వరకూ కొనసాగింది. ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల దేశభక్తి గీతాలాపన

సీటీఆర్ఐ: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక సీతంపేట గ్రంథాలయ శాఖలో టౌన్ హైస్కూల్ విద్యార్థుల దేశభక్తి గీతాలాపన కార్యక్రమం జరిగింది. వివిధ స్వాతంత్య్ర సమరయోధుల చరిత్రను గ్రంథాలయ అధికారులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు, పాఠకులు కలిసి గ్రంథాలయం నుంచి తిరంగా యాత్ర నిర్వహించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఉండాలని, ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవర్చుకోవాలని గ్రంథాలయ ఉద్యోగులు డి.రాజు, ఎం.వీరలింగం కోరారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయుడు మురళీకృష్ణ, ఎ.కృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో ర్యాలీలో పాల్గొన్న ప్రజలు



బైక్ ర్యాలీలో పాల్గొన్న సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు వాసు, రామకృష్ణారెడ్డి తదితరులు



జేగురుపాడులో సర్పంచ్ స్టాలిన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ



సీతంపేట కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఫ్రీడమ్ పార్క్‌ను సందర్శించిన వీసీ



వీసీ శ్రీనివాసరావుకు పుస్తకాలు అందిస్తున్న జమ్మి రామారావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ వద్దనున్న ఫ్రీడమ్ ఫైటర్స్ పార్క్‌ను మంగళవారం యూనివర్సిటీ విద్యార్థులతో పాటు, వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు సందర్శించారు. ఆంధ్రకేసరి యువజన సమితి నాయకులు జమ్మి రామారావు, దేశిరెడ్డి బలరామనాయుడు, మాదిరాజు శ్రీనివాసరావు వీసీ ఆచార్య శ్రీనివాసరావుకు స్వాగతం పలికారు. స్వాతంత్య్ర సంగ్రామంలో రాజమహేంద్రవరం ప్రాంతం నుంచి పోరాడిన వీర మహిళల విగ్రహాలను, వారి పోరాట పటిమను, వారి జీవిత గాథలను జమ్మి రామారావు వీసీకి వివరించారు. ఈ సందర్భంగా పార్క్‌లోని గాంధీ విగ్రహానికి వీసీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఇంటి నుంచి బయటకు రాని కాలంలోనూ దువ్వూరి సుబ్బమ్మ వంటి మహిళామూర్తులు స్వాతంత్య్రం కోసం పోరాటాలు చేసి, ఆంధ్రదేశంలో అరెస్ట్ అయిన తొలి మహిళగా చరిత్రలో నిలిచారని తెలిపారు. మహిళలు అంతటి వీరోచితంగా ఉంటూ, లక్ష్య సాధనకు కృషి చేయాలని తెలిపారు. అలాగే మహిళా స్వాతంత్య్ర సమరయోధుల గొప్ప లక్షణాలను విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి, మహనీయులను ఆదర్శంగా తీసుకొని జీవిస్తే, ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. అనంతరం రాజమహేంద్రవరం కేంద్రంగా జమ్మి రామారావు ప్రచురించిన వివిధ పుస్తకాలను ఆయన విశ్వవిద్యాలయానికి బహూకరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు ఎం.గోపాలకృష్ణ, రాజశేఖర్, అప్పలరాజు, శిరీష, సుజాత, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): కోల్‌కతా ఆర్‌జీఆర్ కళాశాలలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడిపై ఎస్ఎఫ్ఐ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేఆర్ మహిళా కళాశాల వద్ద నిరసన చేపట్టారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎస్.రాజా మాట్లాడుతూ ఈ ఘటనపై విచారణ జరపాలని, దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. వైద్యులకే భద్రత లేకపోతే, సాధారణ వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దేశంలో ఇలా ఎన్నో లైంగిక దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. సంఘ నాయకులు ఎస్.కనక, కె.జ్యోతి, చైతన్య, దుర్గ హేమంత్, మౌనిక, మేఘన, వాని, సంతోషి, హారిక, రమ్య పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 32 మంది ఎంపిక

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): వివిధ కళాశాలల విద్యార్థులకు స్థానిక ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 32 మంది ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. మొత్తం 84 మంది విద్యార్థులు హాజరైనట్టు చెప్పారు. మూడు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారన్నారు. కళాశాల జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఆ.హరినాథ్‌రెడ్డి పర్యవేక్షించారు.

స్వాతంత్య్ర పోరాట స్ఫూర్తికి నిదర్శనం



కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలు

మధురపూడి: ఎందరో స్వాతంత్య్ర యోధుల పోరాట స్ఫూర్తి అక్కడ తొణికిసలాడుతోంది. కోరుకొండ మండలం కాపవరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో స్వాతంత్య్ర సమర యోధుల పోరాట గాథను వినిపించేలా వారి చిత్రపటాలు ఏర్పాటు చేయడం ఇక్కడ విశేషం. ఎంపీడీఓ కార్యాలయ భవనంలో వివిధ జిల్లాలకు చెందిన 25 మంది యోధుల చిత్రపటాలను ఏర్పాటుచేశారు. స్వాతంత్య్ర పోరాట వీరుల స్మారక స్థూపాన్ని కూడా నెలకొల్పారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులపై పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, రాష్ట్ర సాధన కోసం అసువులు బాసిన పొట్టి శ్రీరాములు, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన చిలకమర్తి వెంకటనరసింహం, గుంటూరుకు చెందిన కొండా వెంకటప్పయ్య తదితరుల చిత్రపటాలున్నాయి. సమితి కార్యాలయంలో ఉన్న యోధులను స్మరిస్తూ, స్మారక స్థూపాన్ని గతేడాది ఇక్కడ పునఃప్రతిష్ట చేశారు. ప్రస్తుత ఎంపీపీ ఉల్లి వీరవెంకట సత్యసూర్యకుమారి, నాటి ఎంపీడీఓ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటుచేశారు.

సినిమాలు

శ్యామల	:	రాయన్
సూర్యమినీ	:	తుఫాన్
సూర్య ప్యాలెస్	:	మురారి
స్వామి	:	శివం భజే
శివజ్యోతి	:	సింబా
అనుశ్రీ	:	కమిటీ కుర్రోళ్లు
రంభ	:	సూపర్ డీలక్స్
ఊర్వశి	:	తుఫాన్
మేనక	:	ల్యాండ్ మాఫీయా, బడ్డీ
కుమారి	:	మురారి
అప్సర	:	భవనమ్
అశోక	:	కల్కి 2898 ఏడీ
నామవరం		
డీఎస్ మహల్	:	కమిటీ కుర్రోళ్లు
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	కమిటీ కుర్రోళ్లు
కడియం:		
వెంకటసూర్య	:	శివం భజే